# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు త్వరలో శంకుస్థాపన చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్రంలోని లిఫ్ట్ స్కీంలకు మరమ్మతులు చేసి రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
- ❖ రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి ఉప్పు భూముల కేటాయించడంలో సహకారం అందించాలని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ ని మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి కోరారు.
- ❖ బంగాళాఖాతంలోని అల్పపీడనం రానున్న రెండు, మూడు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

స్టీల్‌ప్లాంట్ రాకతో రాయలసీమ ప్రాంతంలో నవశకం మొదలైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో 16 వేల 350 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక జే.ఎస్.డబ్ల్యూ. ఉక్కు కర్మాగార పనులను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ఈ స్టీల్ ప్లాంట్ కోసం 1,100 ఎకరాలు భూమి ఇచ్చామని సుమారు 16 వేల కోట్ల రూపాయలతో మొదటి రెండు విడతల ఉక్కు కర్మాగార పనులకు నాంది పలికామని చెప్పారు. సోలార్ ఎనర్జీకి 20 వేల 350 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టబోతున్నారని, రెండు విడతల్లో కలిపి మొత్తం 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు. అదే విధంగా వచ్చే ఆగస్టు 15 లోగా లక్ష కోట్ల రూపాయలతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రైతులకు అధిక ప్రాధాన్యతనిస్తూనే ప్రభుత్వం పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తోందని విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి ఈరోజు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శృంగవరపుకోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు. రైతులనుద్దేశించి మంత్రి అనిత మాట్లాడుతూ... రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు తమ భూములను త్యాగం చేయడం వల్లనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని, వారికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మొదటి దశలో 535 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ఎం.ఎస్.ఎం.ఈ. పార్కు ద్వారా సుమారు 45 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు రాకతో ఎస్.కోట నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉందని, పరిశ్రమల రాకతో పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని మంత్రి తెలియజేశారు.

====================

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో 15.33 కోట్ల రూపాయలతో వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు ప్రారంభించారు. ఈ ఎత్తిపోతల పథకం జగ్గయ్య పేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలోని 17 వేల 366 ఎకరాల ఆయకట్టుకు నీరందించనుంది. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి రామానాయుడు పాత్రికేయులకు వెల్లడించారు. రాష్ట్రంలో 1,023 లిఫ్ట్ స్కీం లు ఉంటే వాటిలో కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని చెప్పారు. దెబ్బ తిన్న లిఫ్ట్ స్కీంల మరమ్మతులతో పాటూ 10 ఏళ్ళ నిర్వహణ పనులు చేసేలా 4 వేల 500 కోట్ల రూపాయలతో టెండర్లు పిలుస్తున్నామని చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకువచ్చి లక్షలాది మంది రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

====================

ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీ. సీ. జనార్ధన్ రెడ్డి కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో ఈరోజు సమావేశమయ్యారు. రాష్ట్రంలో తీర ప్రాంత మౌలిక సదుపాయాల బలోపేతం, సకాలంలో పోర్టు ఆధారిత అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. మూలపేట పోర్టు అభివృద్ధిలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ భాగస్వామ్యం, రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి ఉప్పు భూముల కేటాయింపులో కేంద్రం సహకారం అందించాలని  కోరారు. సాగర్‌మాల పథకం కింద గంగవరం పోర్టు, అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (AMNS) పోర్టుకు అనుసంధాన రహదారులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగర్‌మాల 2.0 కింద ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం, దుగ్గరాజపట్నం మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్‌కు సహకారం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మారిటైమ్ మౌలిక సదుపాయాల కల్పనతో తూర్పు తీరంలో ప్రధాన పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జనార్ధన్ రెడ్డి కేంద్రమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

====================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ ఫారాలను బి.ఎల్.ఓలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అధికారులతో కలెక్టర్ ఈరోజు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్ఐఆర్ మ్యాపింగ్ శాతం పెంచాలని బి.ఎల్.ఓలను ఆదేశించారు. బి.ఎల్.ఓలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని ఆర్ఓలు, ఏఈఆర్ఓలు

పరిష్కరించాలన్నారు. 2025 ఓటర్ జాబితా తప్పని సరిగా బి.ఎల్.ఓల దగ్గర పెట్టుకోవాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృతి చేయాలని కలెక్టర్ పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================

మూడు రోజుల చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడుపల్లె మండలం పొగురుపల్లె గ్రామానికి ఈ సాయంత్రం చేరుకున్నారు. అక్కడ 200 కోట్ల రూపాయలతో నిర్మించిన ఏబీఐఎస్ ప్రోటీన్స్ పరిశ్రమను ప్రారంభించారు. యూనిట్ పని తీరును కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. 30.75 ఎకరాల్లో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ చికెన్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. ఏబీఐఎస్ పరిశ్రమ ద్వారా 1,400 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పించనున్నారు. ప్రారంభ దశలోనే 400 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. చికెన్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక కోళ్ల పెంపకందారులకు లబ్ధి చేకూరనుంది.

====================

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన నిన్నటి అల్పపీడనం రానున్న రెండు, మూడు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పలు సూచనలు జారీ చేసింది.

====================

హజ్ యాత్ర–2026కు సంబంధించి రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులందరూ సురక్షితంగా స్వదేశానికి చేరుకోవడంపై హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా హర్షం వ్యక్తం చేశారు.

====================
====================